క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ నలమాస రాములు వృత్తి రీత్యా తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. అతడు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చుల కోసం అతడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఆదివారం రూ.2,50,000 ఎల్‌ఓసీని బాధితుడి కుమారుడు నలమాస ఉదయ్‌కి హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎల్లు అశోక్‌రెడ్డి, చామకూరి శ్రీనివాస్‌లు ఎమ్మెల్యే సామేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుందూరు చంద్రశేఖర్‌రెడ్డి, చామకూరి కిరణ్ పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

అర్వపల్లి : ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎం.వెంకటరంగారావు అన్నారు. అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్రవిషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఆదివారం ఈ కేంద్రంలో జరిగే ధ్యాన కార్యక్రమానికి ప్రజలు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షకుడు పి.రమేష్, మేకల సత్యనారాయణ, మనుబోతుల వీరయ్య, ఉమారాణి, రమేష్, సతీష్, అనిల్, జనార్దన్ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి పాశవిక చర్య అని, ఈ చర్యను సీపీఐ ఖండిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి అన్నారు. శనివారం రాత్రి తొండ గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ఎస్‌బీ. ఫయాజ్, ఎండీ.ఎక్బాల్, కొమురెల్లి, కె.అశోక్, శ్రీను, సత్తయ్య పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిరాల : మేడే వేడుకల్లో ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామనర్సయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మేడే వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మరికంటి ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య, ఈర్లాల కిరణ్, బర్పటి వెంకటయ్య, ఉపేందర్, గోపయ్య, వెంకటసోములు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యే మురుగు




తిరుమలగిరిలోని 15వ వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

తిరుమలగిరి : మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 5, 7, 15 వార్డులతోపాటు శివారు ప్రాంతాలలో మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిలుస్తోంది. దీంతో ఇళ్ల పరిసరాలు పందులకు, దోమలకు ఆవాస ప్రాంతంగా మారుతున్నాయి. దోమల బెడదతో జ్వరాల బారిన పడుతున్నట్లు కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు తొలగించాలని, డ్రెయినేజీ వ్యవస్థను సరిచేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వేసవిలోనూ జలకళ

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామంలోని ఊరచెరువు వేసవిలోనూ నీటితో కనువిందుచేస్తోంది. యాసంగి సీజన్‌లో రైతులు ఈ చెరువులో మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పొలాలకు వాడుకున్నారు. అయినా ప్రస్తుతం చెరువు నీటితో కళకళలాడుతూనే ఉంది.



నీటితో కళకళలాడుతున్న ఊరచెరువు

వసతులు లేక నిరుపయోగం

- శ్మశాన వాటికల్లో సౌకర్యాల లేమి
- ఊళ్లకు దూరంగా ఉండటంతో వెళ్లలేకపోతున్న ప్రజలు



పాశ్యానాయక్ తండాలో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

చివ్వెంల : గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామాలు వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని వైకుంఠధామాలను గ్రామాలకు దూరంగా నిర్మించడం, మరికొన్నింటికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం తదితర సమస్యలతో ప్రజలు వాటిని ఉపయోగించడంలేదు. వైకుంఠధామాలను నిర్మించిన ప్రభుత్వం వాటిల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, సరిపోను గదులు వంటి మౌలిక వసతులు కల్పించలేదు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం..

చివ్వెంల మండలంలోని గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో సగానికి పైగా శ్మశాన వాటికలకు విద్యుత్ సౌకర్యం లేదు. విద్యుత్ సౌకర్యం ఉన్నవాటికి వేలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి నిర్మాణ సమయంలో ముందు చూపు కరువైంది. శ్మశాన వాటికలకు వెళ్లే దారులు చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల శ్మశానవాటికలను గ్రామాలకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో, మరికొన్ని చోట్ల చెరువుల్లో ఏర్పాటు చేయడం వల్ల అవి నిరుపయోగంగా మారుతున్నాయి. శ్మశానవాటికలు ఉన్నప్పటికీ ప్రజలు వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటికల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని మండల వాసులు కోరుతున్నారు.

రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు

వైకుంఠధామాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో శ్మశానవాటిక నిర్మించారు. ఎవరైనా చనిపోతే అక్కడికి వెళ్లాలంటే దారి సరిగా లేదు. వర్షం వస్తే ఇంకా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శ్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం, నీటి వసతి కల్పించాలి. సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి.

- ధరావతు క్రిష్ణ, పాశ్యానాయక్‌తండా

పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీలదే

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీలో ఒకటి చొప్పున వైకుంఠధామాలు నిర్మించడం జరిగింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్మాణాలు జరిగాయి. గ్రామాల్లోని వైకుంఠధామాల్లో వసతుల కల్పన, వాటి పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీదే.

- సంతోష్ కుమార్, ఎంపీడీఓ

సువెన్ ఫార్మా ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ పార్థసారథి

సూర్యాపేట : సూర్యాపేట మండల పరిధిలో గల భరోసా సెంటర్‌లో సువెన్ ఫార్మా కంపెనీ వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని డీఎస్పీ కె.పార్థసారథి ఆదివారం ప్రారంభించి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం ఉచితంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న సెవెన్ కంపెనీ మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. కార్యక్రమంలో సువెన్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ బి.వెంకటరమణ, డిప్యూటీ మేనేజర్ దుస్సా సైదులు, పీవీ రమణ, శ్రీనివాసరావు, పి.సతీష్, టి.మధు, బి.కృష్ణ, క్యాపస్టోన్ జీవన్ నాయక్, విజయ, తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న



అన్నదానం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని రీజియన్ –6 వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ అన్నారు. అమావాస్య తిథి సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ డిస్ట్రిక్ట్ వీ104ఏ రీజియన్ –6 ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా అమావాస్య తిథి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గుమ్మడివెల్లి శ్యాంసుందర్, సెక్రటరీ యమా సంతోష్, బిక్కుమల్ల కృష్ణ, రవీందర్, పబ్బతి వేణుమాధవ్, రాచకొండ శ్రీనివాస్, మణికంఠ, శ్రీరంగం రాము పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర కళలను కాపాడాలి



జాజిరెడ్డిగూడెంలో జడకొప్పు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగోదాదేవి మహిళా కోలాట బృందం

అర్వపల్లి : తెలంగాణ కళలను కాపాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో జరిగిన శ్రీగోదాదేవి మహిళా కోలాట బృందం జడకొప్పు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు వివిధ రకాల కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, నర్సింగ కృష్ణమూర్తి, కొమిరెల్లి, కె.సత్తయ్య, బింగి కృష్ణమూర్తి, శ్రీనివాస్, నాగరాజు, రాజు, రాంప్రసాద్, ఖాజ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

అర్వపల్లి : మండల పరిధిలోని నాన్యతండాలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు ఎంపీడీఓ టి.గోపి వెళ్లి సర్వే చేశారు. గ్రామానికి 4 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ నెల 30 వరకు మండల వ్యాప్తంగా సర్వే చేసి అర్హుల జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, నాగు పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, కోటిరెడ్డి, జయపాల్‌రెడ్డి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనుపాండే, శ్రీరాంపాండే పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, దేవస్థాన ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



ఆత్మకూరులో నిరసన తెలుపుతున్న నాయకులు



నూతనకల్‌లో..



అర్వపల్లిలో..

ఆత్మకూర్ (ఎస్) : కర్రెగుట్టపై ఆపరేషన్ కగార్ పేరుతో సాయుధ బలగాలు చేస్తున్న కూంబింగ్, ఎదురు కాల్పులను తక్షణమే నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినప్పటికీ కొన్ని మాసాలుగా కేంద్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలను వెచ్చించి నరమేధాన్ని సృష్టిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య మునగడకు ఇలాంటి చర్యలు తీవ్ర ప్రమాదమని, ఆదివాసీల జీవించే హక్కును హననం చేసే అధికారం కేంద్రానికి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, డేగల వెంకటకృష్ణ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, సుధగాని వెంకన్న, బోగిని నాగయ్య, సీతారాం రెడ్డి, చల్లా రవీందర్ రెడ్డి, లింగయ్య, వరికుప్పల కనకయ్య, సంఘం వీరయ్య పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఆదివాసీ జాతిని అంతం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మండల కేంద్రంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, దేసోజు మధు, గడ్డం శ్యాం, సామ నర్సిరెడ్డి, మండడి భూపాల్‌రెడ్డి, పులుసు మహేష్, గునగంటి శ్రీను, భయ్యా వెంకన్న, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కర్రెగుట్టల్లో పోలీస్ భద్రత బలగాల కూంబింగ్‌ను నిలిపివేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు అర్వపల్లిలో నిరసన ప్రదర్శన జరిపారు. సాయుధ బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకుడు పోలెబోయిన పెదలింగయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, మధుకర్, సురేష్, విజయ్, నాగయ్య, యాగానందం, కృష్ణమూర్తి, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి వరంగల్ బీఆర్‌ఎస్ రజోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. 26వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ నిమ్మల ప్రవంతి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆటో నగర్, ఆటో యూనియన్, టైర్స్ ఓనర్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు భారీ సంఖ్యలో బయలుదేరారు. తరలినవారిలో రేపల్లె ఉపేందర్, వట్టే లింగరాజు, రేపల్లె రాజా, లతీఫ్, యంజాలా వెంకటేష్, ఆది నారాయణ, నిమ్మల నర్సయ్య పాల్గొన్నారు.

45వ వార్డు నుంచి..

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు 45వ వార్డు నుంచి మాజీ కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది నాయకులు తరలివెళ్లారు. తరలినవారిలో సయ్యద్ సలీం, ఎంఏ రషీద్, వుల్లి రామాచారి, సురేందర్ రెడ్డి, బద్దం రాజిరెడ్డి, పగిల్ల మల్లారెడ్డి, పొన్నాల ముక్తారెడ్డి ఉన్నారు.

తిరుమలగిరి : వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ సభకు తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, సంకెపల్లి నరోత్తమ్‌రెడ్డి, ఏమోజు రవీందర్, ఎండీ.షకీల్, కారుపోతుల నరేష్, సందీప్, రామ్మూర్తి గౌడ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లితోపాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ రజతోత్సవాలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, వల్లపు గంగయ్య, మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్, బొడ్డు రామలింగయ్య, పందిరి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఆదివారం జాజిరెడ్డిగూడెం మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.

తుంగతుర్తి : బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ఆదివారం మండల పరిధిలోని నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా తమ తమ గ్రామాలలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించారు. తరలిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య నాయకులు గుండగాని రాములుగౌడ్, శ్రీశైలం, రవికుమార్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నూతనకల్ : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి కార్యకర్తలు ఆదివారం భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్, బత్తుల సాయిలుగౌడ్, గుగులోతు నర్సింగ్‌నాయక్, చూడి లింగారెడ్డి, బిక్కి బుచ్చయ్య, బత్తుల విద్యాసాగర్ ఉన్నారు.

పెన్‌పహాడ్ : బీఆర్‌ఎస్ రజతోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అనంతారంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కట్ల నాగార్జున పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండలంలోని గాజులమల్కాపురం శివారులోని శ్రీ సమ్మక్క–సారలమ్మ దేవాలయం వద్ద బీఆర్‌ఎస్ మండల నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, కట్ల నాగార్జున, దంతాల వెంకన్న, చిట్టెపు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం పెద్ద మొత్తంలో తరలివెళ్లారు. మండల వ్యాప్తంగా 40 డీసీఎంలలో బయలుదేరారు. అలాగే గ్రామ గ్రామాన బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుమలగిరిలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు



పెన్‌పహాడ్ : అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యా మందిర్ 2001–2002 విద్యాసంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. గత స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, రాములు, శర్మ, నారాయణ, వీరయ్య, పూర్వ విద్యార్థులు విద్య, సందీప్, సోమేష్, సందీప్ నేత, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : అనంతారం జిల్లా ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ ఉపాధ్యాయులు నారాయణ, వెంకట్‌రెడ్డి, రాఘవరెడ్డి, రాజేందర్‌లను సన్మానించారు.



తుంగతుర్తిలోని జెడ్పీ హెచ్ఎస్‌లో..

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం 2000–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు కాసం మల్లయ్య, పాలవరపు సంతోష్, ఆకారపు రాములు, సుదర్శన్, ఓరుగంటి అంతయ్య, ముచ్చ సురేందర్ రావు, ఫజల్, మేనేని మాధవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, పూర్వ విద్యార్థులు రేగటి భాస్కర్, మల్లెపాక సాయిబాబా, ఎనగందుల రవి, కొమరయ్య, భాషమియా, సురేష్, వెంకన్న, కిరణ్, నిర్మల, మంజుల, ఉప్పలయ్య, కటకం నాగరాజు, వెంకన్న, శ్రీకాంత్, గోపగాని మల్లేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి

నూతనకల్ : కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం లింగంపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సమ్మెట వెంకటయ్య, మాజీ సర్పంచ్ గోరుగంటి రాంకిషన్ రావు, ఉప్పుల పాపయ్య, నూకబత్తిని జానయ్య, బంటు బద్రి, గంగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ

కోదాడ : కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కులమతాలకతీతంగా 140కోట్లమంది భారతీయులు ఏకతాటిపై నిలబడి పాకిస్తాన్ ఉగ్రవాద కిరాతక చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పైడిమర్రి నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి పందిరి సత్యనారాయణ, సంఘం నాయకులు పైడిమర్రి సత్యబాబు, ఓరగంటి ప్రభాకర్, గరిణె శ్రీధర్, పైడిమర్రి వెంకటనారాయణ, చల్లా ప్రకాష్‌రావు, ఇడుకుళ్ల చెన్నకేశవరావు, ఇమ్మడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం తయారీకి సిద్ధం

- పాఠశాలల వారీగా క్లాత్ పంపిణీ చేస్తున్న అధికారులు
- మహిళా సంఘాల సభ్యులకు తయారీ బాధ్యత



మహిళా సంఘాల సభ్యులకు యూనిఫాం క్లాత్ అందజేస్తున్న ఎంఈఓ నకిరేకంటి రవి

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజున యూనిఫాం అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా యూనిఫాం తయారీ బాధ్యతను స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు అప్పగించింది. ఇప్పటికే యూనిఫాం తయారీకి అవసరమైన క్లాత్‌ను సరఫరా చేయగా.. మండలంలో పాఠశాలల వారీగా విద్యార్థులకు అవసరమైన క్లాత్‌ను అధికారులు పంపిణీ చేశారు. విద్యార్థులకు యూనిఫాం సకాలంలో అందించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు.

పెన్‌పహాడ్ మండల పరిధిలో ఇలా..

పెన్‌పహాడ్ మండలంలో 52 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 2420 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ముందుగా ఒక్కో జత యూనిఫాం అందించనున్నారు. ఇందు కోసం మండలంలో మహిళా స్వశక్తి స్కూల్ యూనిఫాం కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. టైలరింగ్ వచ్చిన మహిళా సంఘాలతో యూనిఫాం తయారీకి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి కల్పించేందుకు విద్యార్థుల యూనిఫాం తయారీ బాధ్యతను అప్పగించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా గతేడాది ఒక్కో జతకు రూ.75 చెల్లించారని, ఈ ఏడాది కూలి రేటు పెంచాలని కోరుతున్నారు.

మహిళా సంఘాలకు అప్పగించాం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మొదట ఒక జత యూనిఫాం తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. యూనిఫాం తయారీకి అవసరమైన క్లాత్ అందించారు. ఈ ఏడాది 30 స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు క్లాత్ సరఫరా చేశాం. యూనిఫాం దుస్తులను సకాలంలో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

- అజయ్‌నాయక్, ఏపీఎం

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మునగాల : మునగాల మండల పరిధిలోని తాడువాయి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొండమీది సాంబయ్య, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు తంగెళ్ల నరేష్ ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన స్థానికంగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుచ్చిపాపయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గట్టు ఉపేందర్ రావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కెళ్లపాటి సాయి, కారింగుల వెంకన్న, కోల వెంకన్న, మచ్చ శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు సందీప్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన సాంబయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బుచ్చిపాపయ్య